


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 136 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | బుధవారం 21 జనవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :136 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | WED 21 JANUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur






# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 136 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 21 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :136 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 21 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## మీవల్లే పోలీసులపై నమ్మకం పెరిగింది..

**మహిళా కానిస్టేబుల్ జయశాంతికి మంత్రి అనిత అభినందనలు**

- విధి నిర్వహణలో చూపిన చొరవను ప్రత్యేకంగా అభినందించిన మంత్రి
- జయశాంతి చర్య పోలీసులపై ప్రజల నమ్మకాన్ని పెంచిందన్న అనిత
- త్వరలో కలుద్దామని కానిస్టేబుల్‌కు హామీ ఇచ్చిన హోంమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**మహిళా కానిస్టేబుల్ జయశాంతిపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశంసలు కురిపించారు. ఆమెకు స్వయంగా ఫోన్ చేసి అభినందించారు. విధి నిర్వహణలో లేనప్పటికీ సమాజం పట్ల

- మిగతా 7లో...

## పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను మించిన గమ్యస్థానం లేదు

- దావోస్ లో చంద్రబాబు టీమ్ బిజీ బిజీ
- ఒక్కసారి ఏపీకి వచ్చి చూడాలని పారిశ్రామికవేత్తలకు పిలుపు
- కూటమి ప్రభుత్వ వ్యాపార వేగం కళ్లారా చూడాలని సూచన




**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌ను మించిన ఉత్తమ పెట్టుబడుల గమ్యస్థానం మరొ కటి లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారిశ్రా మికవేత్తలు స్వయంగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను, పెట్టుబడులకు ఉన్న సానుకూల వాతావరణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆయన ఆహ్వానిం చారు. రాష్ట్రంలో తాము పాటిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాలను చూసిన తర్వాతే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశాల్లో పాల్గొంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంగళవారం సీఐఐ నిర్వహించిన "ఇండియా ఎట్ ది సెంటర్: ది జాగ్రఫీ ఆఫ్ గ్రోత్ – ది ఆంధ్రప్రదేశ్ అడ్వాంటేజ్" అనే సెషన్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ కేవలం పెట్టుబడుల గమ్యస్థానం మాత్రమే కాదని,

- మిగతా 7లో...





## ఫ్రాన్స్ షాంపేన్ పై 200 శాతం పన్ను.. ట్రంప్ తాజా వార్నింగ్

- అమెరికా శాంతి మండలిలో చేరబోనన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్
- తన ఆహ్వానాన్ని తిరస్కరించడంపై ట్రంప్ సీరియస్
- ఫ్రాన్స్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే షాంపేన్, వైన్ లపై భారీ సుంకాలు

- మిగతా 7లో...



## ఆ కంపెనీని కొనమంటారా, వద్దంటారా...

**ఎక్స్ యూజర్లను అభిప్రాయం అడిగిన ఎలాన్ మస్క్**

- ర్యాన్‌ఎయిర్ సీఈఓతో మాటల యుద్ధం తర్వాత మస్క్ సంచలన పోల్
- ఎయిర్‌లైన్స్‌ను కొనుగోలు చేయాలా అని ఎక్స్‌లో యూజర్ల అభిప్రాయ సేకరణ
- విమానాల్లో స్టార్‌లింక్ వైఫై ఏర్పాటుపై వివాదంతో మొదలైన గొడవ
- కొనుగోలుకు అనుకూలంగా 76 శాతానికి పైగా యూజర్ల ఓటు
- ఒకరినొకరు 'ఇడియట్' అంటూ దూషించుకున్న ఇద్దరు సీఈఓలు

- మిగతా 7లో...

## ఇకపై నితిన్ నబినే నా బాస్.. నేను కార్యకర్తను మాత్రమే

- బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబిన్
- పార్టీ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన జాతీయ అధ్యక్షుడిగా గుర్తింపు
- నూతన అధ్యక్షుడిని అభినందించిన మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్
- వికసిత భారత్ లక్ష్య సాధనలో నబిన్ నాయకత్వం కీలకమన్న ప్రధాని

- మిగతా 7లో...



## అసెంబ్లీ నుంచి అలిగి వెళ్లిపోయిన గవర్నర్..

**తమిళనాడులో మరో వివాదం**

- సీఎం స్టాలిన్ వర్సెస్ గవర్నర్ ఆర్.ఎన్.రవి
- అసెంబ్లీలో జాతీయ గీతం ఆలపించలేదని ఆరోపించిన గవర్నర్
- తాను కోరినా స్పీకర్ వినిపించుకోలేదని ఆగ్రహం



**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు అసెంబ్లీలో మరో వివాదం రేగింది. అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించి ప్రసంగించాల్సిన గవర్నర్ మధ్యలోనే వెళ్లిపోయారు. సభలో జాతీయ గీతం పాడాలని కోరినా సభాపతి వినిపించుకోలేదని లోక్‌భవన్ వెల్లడించింది. దేశంలోని అన్ని శాసన సభలలో గవర్నర్ ప్రసంగానికి ముందు జాతీయ గీతాలాపన చేయడం సంప్రదాయంగా కొనసాగుతోందని, స్టాలిన్ సర్కారు మాత్రం ఈ సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తోందని పేర్కొంది. దీనికి నిరసనగా గవర్నర్ ఆర్.ఎన్.రవి అసెంబ్లీ

- మిగతా 7లో...



## వైఎస్ వివేకా హత్య కేసు.. సుప్రీంకోర్టులో కీలక పరిణామం

- ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా అని సీబీఐని ప్రశ్నించిన ధర్మాసనం
- ఎవరిని విచారించాలనుకుంటున్నారో చెప్పాలని ఆదేశం
- తదుపరి విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు లో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా? అనే అంశంపై సీబీఐని సుప్రీంకోర్టు స్పష్టంగా ప్ర శ్నించింది. ఎవరిని కస్టడీలోకి తీసుకుని విచారించా లనుకుంటున్నారో, ఏయే అంశాలపై మరింత విచారణ అవసరమో వివరంగా తెలపాలని ధర్మాసనం ఆదేశించింది. అనంతరం కేసు విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది.వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తుపై ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను

- మిగతా 7లో...

## నేల విషతుల్యమవుతోంది

- సేంద్రియ వ్యవసాయంపై సదస్సులో పాల్గొన్న నారాయణ, చిన్న జీయర్ స్వామి
- ప్రతి రైతు సేంద్రియ సాగు వైపు మళ్లాలన్న నారాయణ
- అత్యాశ వల్ల ప్రకృతి నాశనం అవుతోందన్న జీయర్ స్వామి



**పెన్ పవర్ డెస్క్:**నేలకొండపల్లిలోని సిద్ధార్థ యోగ విద్యాలయంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుల మందుల అధిక వినియోగంతో నేల విషతుల్యమవుతోందని, దీని ప్రభావం

- మిగతా 7లో...

## క్యాసినోలు, రికార్డింగ్ డ్యాన్సులకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చారు



- సంక్రాంతి పండుగను అడ్డంపెట్టుకుని విచ్చలవిడిగా వ్యవహరించారన్న కల్యాణి
- మహిళలు బట్టలు విప్పి నాట్యాలు చేయాలంటూ కూటమి నేతలు బూతులు మాట్లాడారని ఆరోపణ
- ప్రభుత్వం ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని మండిపాటు

- మిగతా 7లో...

## ప్రమాదంలో గాయపడిన జనసేన నేత పాంగి శ్రీనును పరామర్శించిన గొర్లె వీర వెంకట్



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 20:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయతీ సిహెచ్ చెరపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ పంచాయితీ ప్రధాన కార్యదర్శి పాంగి శ్రీను కనుమ పండగ రోజు జరిగిన బైకు ప్రమాదంలో గాయపడ్డారు.విషయం తెలుసుకున్న జానపద కళలుసృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరి గంగులయ్య సూచనల మేరకు అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ సిహెచ్ చెరపల్లి గ్రామానికి వెళ్లి పాంగి శ్రీనును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాంగి శ్రీను తనను పరామర్శించడానికి వచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పరామర్శించిన వారిలో పేసా మండల ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు, వార్డు సభ్యులు కోర్ర తెల్లన్న తదితరులు పాల్గొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షించారు.

# పెన్ పవర్
# ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# ఏప్రిల్ 20న సింహాచలం చందనోత్సవం





- ★ భక్తులకు ఇబ్బందుల్లేని ఏర్పాట్లు చేయాలి
- ★ అధికారులకు జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఆదేశాలు

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్టణం, జనవరి 20:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి చందనోత్సవం ఏప్రిల్ 20న వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో చందనోత్సవ ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చందనోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి వేడుకను సజావుగా నిర్వహించాలని సూచించారు. అనువంశిక ధర్మకర్తలు, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించే వారికి, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, దాతలకు అంతరాలయ దర్శనాలు కల్పించే విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని, స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 19వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి సాధారణ దర్శనాలను నిలిపివేస్తామని భక్తులకు ముందుగానే సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

టిక్కెట్ల విక్రయ ప్రక్రియ సజావుగా జరగాలని, నగర పరిధిలో అనుకూల ప్రాంతాల్లో టిక్కెట్ విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రూ.1500, రూ.1000, రూ.300 ధరలతో టిక్కెట్ల జారీని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, టిక్కెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించి స్కానర్ల ద్వారా దర్శనానికి అనుమతించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కొండపైకి వాహనాల రాకపోకలను గణనీయంగా తగ్గించాలని, పరిమిత సంఖ్యలోనే వాహన పాసులు జారీ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.

ఫిబ్రవరి తొలి వారంలో మలివిడత సమీక్ష నిర్వహించేలోగా సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, అన్ని విభాగాల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

ఫిబ్రవరి 28 నాటికి సివిల్ పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం కొండ దిగువ నుంచి పైకి, దర్శనం అనంతరం తిరిగి దిగువకు తరలించేందుకు తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్లలో విరివిగా తాగునీటి కేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గతంతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు సమకూర్చాలని, ప్రయివేటు వాహనాలను కొండపైకి అనుమతించబోమని స్పష్టం చేశారు.



పరిశుభ్రత చర్యలు పక్కాగా చేపట్టాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాలతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 28 నాటికి అన్ని సివిల్ పనులు పూర్తి చేయాలని, ఏప్రిల్ 17 నాటికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం వచ్చినా ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ క్యూలైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ప్రాంతాల గుర్తింపు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు చేశారు. సుమారు 13 కిలోమీటర్ల మేర సాగే క్యూలైన్ల వద్ద షెడ్లు, అత్యవసర ద్వారాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆలయ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీలు మణికంఠ, లతా మాధురి, దేవాదాయ శాఖ అధికారులు, సింహాచలం ఆలయ ఈవో ఎన్. సుజాత, ఆర్డీవోలు సుధాసాగర్, సంగీత్ మాధుర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వేస్ట్ కంపోస్ట్ పిట్స్ ను శుభ్రపరిచారు

## జీవీఎంసీ సానిటరీ ఇన్స్పెక్టర్ పీతల వెంకటేశ్వరరావు

## ముడుసర్లోవ కంపోస్ట్ పిట్స్ లలోచెత్తను తొలగించి శుభ్రపరచిన పారిశ్యద్ధ కార్మికులు


పెన్ పవర్ PEN POWER 24 NEWS
చెత్త “వేస్ట్“కంపోస్ట్ పిట్స్
epaperpenpower.in
19 Jan 2026 - Page 3



పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జనవరి 20:** వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన ముడసర్లోవ పార్కు పిల్లలతో సందడిగా ఉండేది. నిన్నటి వరకు చెత్తాచెదారాలతో మందు బాటిల్లు పేక ముక్కలు ఇతరవ్యర్థలతో ఉండే పార్క్ కంపు కొడుతుంది.పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన“ చెత్త వేస్ట్ కంపోస్ట్ పిట్స్ “వార్తకు స్పందించి 13వ వార్డు సానిటరీ ఇన్స్పెక్టర్ పితల వెంకటేశ్వరరావు.వెంటనే పారిశుద్ధ కార్మికులతో మేస్త్రి మద్దిల కళ్యాణ్.మువ్వల మురళి,మద్ది మంగరాజు లను కంపోస్ట్ పిట్స్ లను శుభ్రం చేసి చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఎంతో కష్టంతో కూడిన రెండు కంపోస్ట్ పిట్స్ లను వారు శుభ్రపరిచారు.కంపోస్ట్ పిట్స్ వాడుకలోనికి తీసుకువచ్చారమని సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర తెలిపారు.



## శ్రీకాకుళం నగరానికి ఎప్పుడు రైల్వే స్టేషన్?

### చిక్కోలు ప్రజల చిరకాల ఆకాంక్షపై పాలకుల మౌనం

-4లో..

# సూర్య క్షేత్రంలో రథసప్తమి సందడి ఏర్పాట్లు పూర్తి చేస్తున్న యంత్రాంగం!





## సామాన్య భక్తులకు పెద్దపీట.. అరగంటలోనే దర్శనం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్.. శ్రీకాకుళం, జనవరి 20:** భానుడి జన్మదినోత్సవమైన రథసప్తమి వేడుకలకు అరసవల్లి క్షేత్రం ముస్తాబవుతోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు స్వామివారి దర్శనం క్యూలైన్లలో భారంగా మారకుండా, ఈసారి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఒక అద్భుతమైన 'వ్యూహ రచన' చేసింది. మ్యాప్ మొదలుకొని క్షేత్రస్థాయి వసతుల వరకు ప్రతి అడుగులోనూ భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

ఆరు వరుసల వ్యూహం.. అరగంటలో దర్శనం!

రద్దీని క్రమబద్ధీకరించేందుకు మొత్తం ఆరు సెక్టార్లుగా ఆలయ పరిసరాలను విభజించారు. గతంలో గంటల తరబడి వేచి చూసే పరిస్థితిని మార్చుతూ, గుడి లోపలి వరకు ఆరు వరుసల క్యూలైన్లను నిర్మించారు.

సెక్టార్ల వారీగా విభజన :

సెక్టార్ 1: మామిడి తోట జంక్షన్ నుండి అసిరితల్లి ఆలయం మీదుగా వెళ్లే మార్గం. ఇక్కడ రూ. 100, ఉచిత క్యూ లైన్లు ఉంటాయి.

సెక్టార్ 2: ఇంద్ర పుష్కరిణి ప్రాంతం. ఇక్కడ ఉచిత దర్శనం, రూ. 100 భక్తుల కోసం వెయిటింగ్ కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి.

సెక్టార్ 3, 3ఏ: బొంపడ వీధి నుండి వైకుంఠ ద్వారం (ఉత్తర ద్వారం) వరకు ఉండే వి.ఐ.పి ఎంట్రీ మార్గం. దీన్నే ఈసారి కొత్తగా ప్రతిపాదించారు. ఫలితంగా ప్రజా ప్రతినిధులకు, సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదు. వీఐపీలు దర్శనం అనంతరం గుడి వెనకనుంచి తిరిగి అదే ద్వారం గుండా బయటికి వస్తారు.

సెక్టార్ 4: ప్రధాన ఆలయ లోపలి భాగం. అన్ని లైన్లు వేరువేరుగా ఇక్కడే కలుస్తాయి. ఇక్కడ భక్తులు వేరువేరుగా, సులువుగా దర్శించుకునేలా వేదికలను ఎత్తుల వారీగా సిద్ధం చేశారు. ఆరు వరుసల్లో వేరువేరుగా సులువుగా దర్శనం కల్పించేందుకు అడుగు, రెండు, మూడు అడుగులు చొప్పున ఏర్పాట్లు ఉన్నాయి.

సెక్టార్ 5: బ్రాహ్మణ వీధి. ఆలయ దర్శనం తర్వాత భక్తులు బయటకు వెళ్లే మార్గం. అక్కడే ప్రసాద కౌంటర్లు, చెప్పుల స్టాండ్లు కూడా సిద్ధంగా ఉన్నాయి.

సెక్టార్ 6: మిల్ జంక్షన్ నుండి అసిరితల్లి ఆలయం వరకు ఉండే ప్రధాన రహదారి (శ్రీకాకుళం నుండి కళింగపట్నం రోడ్డు). గతంలో ఒక దాత (డోనార్) పాస్‌తో నలుగురిని అనుమతించే పద్ధతిని తీసేసి, ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత పాస్ ఇవ్వడం ద్వారా పారదర్శకత పెంచారు.

అడుగడుగునా కొబ్బరి చలువ.. నిరంతర నీటి ధార!

క్యూలైన్లలో గంటల తరబడి నిలబడే భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా భారీ ఎత్తున కొబ్బరి చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. వీటి కింద నిరంతరాయంగా మంచినీరు అందించేలా స్టీల్ సర్వీస్ లైన్లను, స్టీల్ గ్లాస్ లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, ఈసారి ఉచితంగా లక్షకు పైగా లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేసేందుకు యంత్రాంగం సిద్ధమైంది.

టెక్నాలజీతో భద్రతా వలయం:

ఆలయ పరిసరాల్లో చిన్న అపశ్రుతి కూడా చోటు చేసుకోకుండా 257 సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. వీటిని పర్యవేక్షించేందుకు ఆలయం పక్కనే ప్రత్యేక పోలీస్ కంట్రోల్ రూమ్ సిద్ధమైంది. నగరం వెలుపల నుంచే భక్తుల ప్రవాహాన్ని ట్రాక్ చేసేలా ట్రాఫిక్ కంట్రోల్ యూనిట్లను ఏర్పాటు చేశారు. అలాగే మ్యాప్‌లో చూపిన విధంగా సెక్టార్ 1, 2, 5 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు, పబ్లిక్ టాయిలెట్లు అందుబాటులో ఉంచారు.

ట్రాఫిక్ తిప్పలకు చెక్.. వి.ఐ.పిల కోసం సరికొత్త రూట్!

వాహనాల రద్దీని నివారించేందుకు కలెక్టర్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో వి.ఐ.పి వాహనాలు సింహద్వారం వరకు వెళ్లి తిరిగి అదే దారిలో వెనక్కి వచ్చేవి. ఈసారి వాటిని అసిరితల్లి ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా లక్ష్మీ నగర్ మీదుగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం రోడ్డులోకి బయటకు పంపేలా ఏర్పాట్లు చేశారు. సాధారణ ప్రజల వాహనాల కోసం 80 ఫీట్ల రోడ్డు (సెక్టార్ 9) వద్ద విశాలమైన పార్కింగ్ కల్పించారు. దర్శనం ముగిసిన తర్వాత ప్రతి భక్తుడు బ్రాహ్మణ వీధి (సెక్టార్ 5) గుండా బయటకు రావాలి.

సామాన్య భక్తులకు పెద్దపీట ;

ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. “రథసప్తమి రోజున సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. మా ప్రధాన లక్ష్యం సామాన్య భక్తులకు పెద్దపీట వేయడమే. గుడి లోపలి వరకు ఆరు క్యూలైన్ల వరుసలను ఏర్పాటు చేయడం ద్వారా అరగంటలోనే దర్శనం పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. భక్తులెవరూ తొందరపడకుండా, యంత్రాంగానికి సహకరించి ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకోవాలని“ ఆకాంక్షించారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోగొట్టుకున్న మనీ పర్సు బాధితురాలికి అప్పగింత

కంట్రోల్ రూం పోలీసుల బాధ్యతాయుత చర్య



**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ విజయనగరం, జనవరి 20:**విజయనగరం పట్టణ పరిధిలో పోగొట్టుకున్న మనీ పర్సును గుర్తించి, బాధితురాలికి అప్పగించిన ఘటన ప్రశంసనీయంగా నిలిచింది. గజపతినగరం తాశీల్ధార్ కార్యాలయంలో డిప్యూటీ తాశీల్ధార్‌కు పని చేస్తున్న ఒక వ్యక్తికి, విజయనగరం పట్టణంలోని కాళీఘాట్ ప్రాంతంలో మనీ పర్సు లభ్యమైంది. ఆ పర్సును బాధితురాలికి అందజేయాలనే ఉద్దేశంతో జనవరి 20న విజయనగరం పోలీసు కంట్రోల్ రూంలో అప్పగించారు.

కంట్రోల్ రూం ఎస్ఐ జగదీశ్వరరావు తన సిబ్బంది సహాయంతో సదరు పర్సును పరిశీలించగా, అందులో రూ.3,000 నగదు, బ్యాంకు కార్డులు, ఆధార్ కార్డు ఉన్నట్లు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు, ఆ మనీ పర్సు విశాఖ జిల్లా రేగిడి పద్మనాభం మండలానికి చెందిన తిప్పల రమదిగా గుర్తించారు.

వెంటనే బాధితురాలికి సమాచారం అందించిన కంట్రోల్ రూం పోలీసులు, విచారణ అనంతరం మనీ పర్సు ఆమెదేనని నిర్ధారించుకొని, నగదు, పత్రాలతో సహా తిరిగి అప్పగించారు. తన మనీ పర్సు పోగొట్టుకున్న విషయమై తాను ఎలాంటి ఫిర్యాదు కూడా చేయకపోయినా, పోలీసులు స్వయంగా ఫోన్ చేసి బాధ్యతాయుతంగా పర్సును అందజేయడం పట్ల తిప్పల రమ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూం పోలీసులకు, అలాగే మనీ పర్సును పోలీసులకు అప్పగించిన డిప్యూటీ తాశీల్ధార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కంట్రోల్ రూం పోలీసుల ఈ చర్య ప్రజల భద్రత పట్ల వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలిచిందని నగరవాసులు అభినందిస్తున్నారు.

## మక్కువ మెయిన్ రోడ్ నిర్మాణంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

2.65 కోట్ల వ్యయంతో నాణ్యతతో పనులు పూర్తి చేయాలి : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి





**మక్కువ, పెన్ పవర్, జనవరి 20:**2 కోట్ల 65 లక్షల వ్యయంతో మంజూరైన మక్కువ మెయిన్ రోడ్డును ప్రజలకు దీర్ఘకాలంగా ఉపయోగపడే విధంగా, నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని గిరిజన సంక్షేమ శాఖ మరియు స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

మక్కువ మజ్జి గౌరమ్మ గుడి వద్ద నుంచి మక్కువ బ్రిడ్జి వరకు నిర్మించనున్న ఈ మెయిన్ రోడ్ పనులపై మంత్రివర్యులు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మక్కువ ఏం ఆర్ ఓ తో పాటు ఇంజినీరింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో చర్చించి, రోడ్ నిర్మాణంలో సరైన వెడల్పు, బలమైన బేస్, సమర్థవంతమైన నీటి పారుదల సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు.

భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రోడ్ డిజైన్ రూపొందించాలని, పనులు వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ప్రజల పన్ను సొమ్ముతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, నాణ్యత విషయంలో రాజీ పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మక్కువ ప్రాంత అభివృద్ధిలో ఈ రహదారి కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.

## సిరిఖండంలో గడ్డి వాము దగ్నం



**పద్మనాభం,పెన్ పవర్ , జనవరి 20** :పద్మనాభం మండలం సిరిఖండం గ్రామంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వాడపల్లి తులసీకి సంబంధం చిన గడ్డి వాము ఒక్కసారిగా మంటల్లో చిక్కి పూర్తిగా దగ్నమైంది. ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం అందడంతో తగరపువలస అగ్ని మాపక కేంద్రానికి చెందిన సిబ్బంది వెంటనే సం ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదు పులోకి తెచ్చారు. వారి సకాల చర్యల వల్ల మం టలు మరింత వ్యాపించకుండా నిలువరించగలి గారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటన తో గడ్డి వాము పూర్తిగా కాలిపోయి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

# జర్రెల రోడ్డు అభివృద్ధి అత్యవసరం

**నాలుగు పంచాయతీల 30 వేల మందికి జీవనరేఖ**



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 20:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతమైన గూడెం కొత్తవీధి మండలం జర్రెల ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు పంచాయతీలకు చెందిన సుమారు 30 వేల మంది ప్రజల జీవనాధారమైన "జర్రెల రోడ్డు" దయనీయ స్థితిలో ఉండటంతో నిత్య ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చింతపల్లి నుంచి మొండిగడ్డ వరకు సుమారు 15 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ రోడ్డు ఘాటీ మలుపులు, దెబ్బతిన్న ఉపరితలంతో ప్రమాదాలకు కేంద్రంగా మారింది. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల కోసం ప్రయాణించే రోగులు ఈ మార్గంలో తీవ్ర కష్టాలు పడుతున్నారు. అంబులెన్స్‌లు సైతం ఈ రోడ్డుపై సకాలంలో చేరలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్య దశాబ్దాలుగా కొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం దక్కలేదు. ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు వినిపిస్తున్నాయని, అనంతరం ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ జర్రెల రోడ్డు అభివృద్ధి మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోందని విమర్శిస్తున్నారు. గిరి జనజాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ మాట్లాడుతూ,"జర్రెల రోడ్డు అభివృద్ధి విలాసం కాదు మా హక్కు. ఈ రోడ్డు లేకుండా ఈ ప్రాంతానికి భవిష్యత్తే లేదు. నాయకత్వానికి గౌరవం పదవితో కాదు, ప్రజలకు చేసిన సేవతో వస్తుంది" అని పేర్కొన్నారు. నాలుగు పంచాయతీల ప్రజల తరపున జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, ఎమ్మెల్యే, ఎంపీలు తక్షణమే స్పందించి జర్రెల రోడ్డు అభివృద్ధికి, ముఖ్యంగా ప్రమాదకర ఘాటీ మలుపుల సరిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని ఆయన వినమ్రంగా కోరారు. "జర్రెల రోడ్డు మా జీవనరేఖ" "రోడ్డు ఉంటేనే అభివృద్ధి" "మా ప్రాణాలకు విలువ ఇవ్వండి" అని నినదిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీకాకుళం నగరానికి ఎప్పుడు రైల్వే స్టేషన్?








**చిక్కోలు ప్రజల చిరకాల ఆకాంక్షపై పాలకుల మౌనం**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ తో శ్రీకాకుళం, జనవరి 20:**

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నగరానికి ఇప్పటికీ సొంత రైల్వే స్టేషన్ లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. జనాభా, పరిపాలనా అవసరాలు, వాణిజ్య కార్యకలాపాల పరంగా కీలకమైన శ్రీకాకుళం నగరం, రవాణా సౌకర్యాల్లో మాత్రం దశాబ్దాలుగా వెనుకబడే ఉంది.

నగరానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్) రైల్వే స్టేషన్‌పై ఆధారపడాల్సి రావడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ నుంచి నగరానికి సరైన సిటీ బస్సు సౌకర్యం లేకపోవడం, ఆటో చార్జీలు అధికంగా ఉండటం ప్రజలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతోంది. ముఖ్యంగా తెల్లవారుజామున రైళ్లలో దిగే ప్రయాణికుల నుంచి ఆటో డ్రైవర్లు అధిక రేట్లు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రావెల్ బస్సుల పరిస్థితి కూడా దారుణంగానే ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. కాలం చెల్లిన బస్సులను నడుపుతూ, అధిక ధరలు వసూలు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రయాణమధ్యలో తరచూ బ్రేక్‌డౌన్ అవుతూ ప్రయాణికులకు తీవ్ర నరకాన్ని చూపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శ్రీకాకుళం జిల్లా నుంచి విడిపోయిన విజయనగరం జిల్లా, రైల్వే స్టేషన్ ఉండటం వల్ల వేగంగా అభివృద్ధి చెందిందని ప్రజలు గుర్తు చేస్తున్నారు. తాజాగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతుండటంతో అక్కడ అభివృద్ధి పరుగులు పెడుతుండగా, మౌలిక వసతులు విస్తరిస్తున్నాయి. మూడు రింగు రోడ్లు ఏర్పడగా, పట్టణ విస్తరణ శరవేగంగా సాగుతోంది.

అదే సమయంలో శ్రీకాకుళం నగరం మాత్రం రవాణా మౌలిక వసతుల కొరతతో ఇరుకైన రోడ్ల మధ్య నలుగుతోంది. ఒక్క రింగు రోడ్డు కూడా లేకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

శ్రీకాకుళం నగర ప్రజల డిమాండ్లు:

నగరానికి రైల్వే లైన్:

రైల్వే లైన్‌ను కనీసం శ్రీకాకుళం కొత్తరోడ్డు వరకు పొడిగించి, అక్కడ టెర్మినల్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలి.

పేదలకు ఊరట:

పేదలు, మధ్యతరగతి ప్రజలు అధికంగా రైలు ప్రయాణంపై ఆధారపడుతున్నందున వారి ఆర్థిక భారం తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ప్రజాప్రతినిధుల చొరవ:

చిక్కోలు ప్రజల చిరకాల ఆకాంక్షను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే నిధులు మంజూరు చేయించాలి.

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో రవాణా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, రాజకీయాలకు అతీతంగా పాలకులు స్పందించి నగరానికి రైల్వే స్టేషన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా ప్రజా సమస్యల అధ్యక్షులు బెవర వెంకట రవిశంకర్ డిమాండ్ చేశారు.

# సచివాలయాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ







**గుర్ల పీహెచ్‌సీలో వైద్య సేవలపై ఆరా**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయనగరం/ చీపురుపల్లి, జనవరి20:** చీపురుపల్లి మండల కేంద్రంలోని సచివాలయం2, 5లను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, హాజరు పట్టికలను పరిశీలించిన కలెక్టర్, విధులకు గైర్హాజరైన సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పురోగతిపై ఆరా తీశారు. అలాగే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని కలెక్టర్ పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

గుర్ల పీహెచ్‌సీ తనిఖీ

అనంతరం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వైద్యులు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోగులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని, అలాగే ఐవీఆర్ఎస్ సర్వేపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వైద్యులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీఓ రవి, వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# తోటపల్లి బ్యారేజీ వద్ద పాత కాలువల షట్టర్లు మరమ్మతు చేయాలి

**వేసవిలో ఆరుతడి పంటలకు పాలకొండ వరకు సాగునీరు ఇవ్వాలి : ఏపీ రైతు సంఘం విజ్ఞప్తి**



**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్, శ్రీకాకుళం జనవరి 20:**పాలకొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో గౌరవ జిల్లా కలెక్టర్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధులు పలు కీలక సమస్యలపై విజ్ఞాపన పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో రైతు సంఘం మండల సమితి ప్రతినిధులు ఈ విజ్ఞప్తిని సమర్పించారు.

ఈ సందర్భంగా బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ, తోటపల్లి బ్యారేజీ వద్ద ఉన్న పాత కుడి, ఎడమ కాలువల షట్టర్లు దెబ్బతిన్న కారణంగా సాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. వెంటనే వాటిని మరమ్మతులు చేయించి, వేసవి దాహార్తి తీర్చేందుకు ఆరుతడి పంటలకు పాలకొండ మండలం చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న జంపర్‌కోట ప్రాజెక్టు రిజర్వాయర్ పనులను పూర్తిచేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్‌లో పండిన ధాన్యాన్ని పండగకు ముందే నూర్పులు చేసినప్పటికీ, మిల్లర్లకు లక్ష్యాలు కేటాయించకపోవడంతో రైతుల కల్లాల్లోనే ధాన్యం నిల్వలు ఉండిపోయాయని తెలిపారు. దూర ప్రాంతాల్లోని మిల్లులకు ధాన్యం తరలించాలని చెప్పడం వల్ల రవాణా చార్జీలు అధికమై రైతులకు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున స్థానిక పాలకొండ మిల్లర్లకు లక్ష్యాలతో సంబంధం లేకుండా లేదా లక్ష్యాలను పెంచి ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇదే సందర్భంలో వెలగవాడ పంచాయతీలోని మల్లిగెడ్డ ఆనకట్ట పరిధిలో సుమారు 600 ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతుండేదని, రాతి కట్టు దెబ్బతినడంతో ప్రస్తుతం నీటి సరఫరా నిలిచిపోయి ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హాయ్‌కట్టు సంఘం అధ్యక్షులు సీమల కాంతారావు, అల్లు కోటేశ్వరారావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పాలకొండ మండలానికి చెందిన రైతులు స్థానిక ఆర్ఎస్‌కే ద్వారా సీతంపేట మండలం చిన్నబగ్గలోని రైస్ మిల్లులకు ధాన్యం పంపించగా, మిల్లరు అదనంగా ఎనిమిది కిలోల ధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై స్పందించిన జాయింట్ కలెక్టర్, సీతంపేట ఎమ్మార్వోకు ఫోన్ చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు రైతు సంఘం తెలిపింది. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వావిలపల్లి రమణ, ద్వారపూడి అప్పలనాయుడు, పిట్ట రమణ, ఎల్.ఎల్.పురం గ్రామ సర్పంచ్ ద్వారపూడి కుమార్, లావేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బలగ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా జిల్లా కలెక్టర్





- గణితంలో మెళకువలుడ విద్యార్థులతో ముచ్చట్లుడ
- ఐఏఎస్ ప్రస్థానంపై స్ఫూర్తిదాయక సంభాషణ

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్, శ్రీకాకుళం జనవరి 20:**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం బలగలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. పదో తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్, 'రైజింగ్ స్టార్స్', 'స్కై స్టార్స్' గ్రూపులకు చెందిన విద్యార్థులతో సుమారు గంటకు పైగా ముచ్చటించారు.

లెక్కల మాస్టారిగా కలెక్టర్

స్వతహాగా గణిత విద్యార్థి అయిన కలెక్టర్, కొద్దిసేపు ఉపాధ్యాయుడి పాత్రలోకి మారి విద్యార్థులకు గణితంలో మెళకువలు నేర్పారు. కఠినమైన లెక్కలను సులువుగా ఎలా పరిష్కరించాలో బ్లాక్‌బోర్డుపై వివరించారు. గణితంలోని కిటుకులను ఆసక్తికరంగా వివరించడంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా విన్నారు. విద్యార్థులు అడిగిన సందేహాలకు ఆయన ఓపికగా సమాధానాలు ఇచ్చారు.

లక్ష్యం ఉంటే ఏదైనా సాధ్యమే

"భవిష్యత్తులో మీరు ఏమవ్వాలనుకుంటున్నారు?" అని కలెక్టర్ ప్రశ్నించగా విద్యార్థుల నుంచి ఉత్సాహభరిత సమాధానాలు వచ్చాయి. ఈ సందర్భంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్‌తో పాటు వృత్తి విద్యా కోర్సులపై దిశానిర్దేశం చేశారు.

"మీరు కలెక్టర్ ఎలా అయ్యారు?" అనే ప్రశ్నకు స్పందించిన కలెక్టర్, తన బాల్యం, ఐఐటీ గౌహతిలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తొలుత ఐపీఎస్‌కు ఎంపికైనా, పట్టు వదలకుండా కష్టపడి ఐఏఎస్ సాధించిన విషయాన్ని వివరించారు. గణితం, ఫిజిక్స్ పట్ల ఉన్న ఆసక్తి తన విజయానికి తోడ్పడిందని చెబుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం

మధ్యాహ్న సమయంలో కలెక్టర్ విద్యార్థులతో కలిసి కూర్చుని 'డొక్కా సీతమ్మ' మధ్యాహ్న భోజనాన్ని ఆస్వాదించారు. భోజనం రుచిగా ఉందా? మెనూ ప్రకారమే వడ్డిస్తున్నారా? అని విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా, చదువుకు అనుకూలంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ పాఠశాల సిబ్బందిని అభినందించారు.

ఆదర్శంగా నిలిచిన కలెక్టర్

మధ్యాహ్న భోజనం అనంతరం తన ప్లేటును సిబ్బందికి ఇవ్వకుండా, స్వయంగా తానే కడగడం ద్వారా కలెక్టర్ అందరినీ ఆశ్చర్యపరిచారు. "మనము చేసే పనిలో చిన్నదిపెద్దది అనేది ఉండదు. క్రమశిక్షణ, స్వయంకృషి విద్యార్థి దశ నుంచే అలవడాలి" అని తన చర్య ద్వారా సందేశం ఇచ్చారు. కలెక్టర్ నిరాడంబరతకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రశంసలు కురిపించారు.




## గర్భిణికి అరుదైన రక్తం అందజేత

- ఆపద్బాంధవుడిగా నిలిచిన యువకుడు



**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్, శ్రీకాకుళం శ్రీకాకుళం, జనవరి 20:**స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రసూతి కోసం చేరిన ఎం. శ్రీదేవి అనే గర్భిణి మహిళకు అత్యవసరంగా అరుదైన 'ఏ నెగెటివ్' రక్తం అవసరమైంది. ఈ విషయం తెలియగానే రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన్ రావు సూచనలతో ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు జి. పోతయ్య తక్షణమే స్పందించి రక్తదానం చేశారు.

సకాలంలో అరుదైన రక్తం అందించడం ద్వారా గర్భిణి ప్రాణాలను కాపాడిన పోతయ్యను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్ రావు అభినందించారు. ఈ సందర్భంగా పోతయ్యకు ప్రశంసాపత్రం, బంగారు పతకం అందజేసి ఘనంగా సత్కరించారు. క్లిష్ట సమయంలో చూపిన మానవతా స్పందన స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు.

జిల్లాలో రక్త నిల్వలు తగ్గుముఖం పట్టుతున్నాయని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జగన్మోహన్ రావు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఏ. నర్సింగరావు, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అరసవిల్లి రథసప్తమికి రూ.2 కోట్లు మంజూరు

- మంత్రి నారాయణను కలిసిన ఎమ్మెల్యే గొండు శంకర్
- మున్సిపాలిటీ అభివృద్ధి, ఎన్నికలపై కీలక చర్చ



**శ్రీకాకుళం, పెన్ పవర్ జనవరి 20 :**అరసవిల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ వెల్లడించారు. సోమవారం అమరావతిలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, మున్సిపాలిటీ పురోభివృద్ధి, రాబోయే మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవిల్లిలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు మంత్రి నారాయణ హాజరుకావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆహ్వానించారు. రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రథసప్తమి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాల్సిన అవసరాన్ని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి నారాయణ తక్షణమే రూ.2 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న పనుల వేగవంతం, పట్టణ సుందరీకరణపై చర్చ జరిగింది. అలాగే రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నగర డివిజన్ల సంఖ్యను ప్రస్తుతం ఉన్న వాటికంటే పెంచి 60కి తీసుకెళ్లే అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం.

నియోజకవర్గ అభివృద్ధికి, రథసప్తమి వేడుకల నిధుల మంజూరుకు సహకరించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఆంధ్ర జ్యోతికి ప్రభుత్వ భూమి కేటాయింపు అన్యాయం

- ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించిన బీఎస్పీ



**విశాఖపట్నం, పెన్ పవర్, జనవరి 20:**విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు కేటాయించడాన్ని బహుజన సమాజ పార్టీ తీవ్రంగా ఖండించింది. విశాఖ నగరంలోని డాబా గార్డెన్స్ ప్రాంతంలో ఉన్న విశాఖ జర్నలిస్టుల ఫోరం భవనంలో బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా బహుజన సమాజ పార్టీ ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జ్ పెదపెంకి శివప్రసాద్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా విశాఖ జిల్లా పరదేశిపాలెం ప్రాంతంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ పత్రిక సంస్థకు కేటాయించడం పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు. ఆంధ్ర జ్యోతి పత్రిక కోసం ఆమోద పబ్లికేషన్స్ సంస్థకు 74 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమన్నారు.

ప్రజల అవసరాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం ద్వారా బహుజనుల హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దాల్సిన అవసరం ఉన్నప్పటికీ, న్యాయస్థాన ఆదేశాల పేరుతో మళ్లీ అదే భూమిని లేదా ప్రత్యామ్నాయ ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించడం ప్రజా ఆస్తుల దుర్వినియోగంగా బీఎస్పీ భావిస్తోందన్నారు.

ఉత్తరాంధ్ర ప్రాంతంలో భూమిలేని పేదలు, దళితులు, బడుగు వర్గాలు నివాసం, ఉపాధి కోసం పోరాడుతున్న సమయంలో ఈ విధంగా ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం తీవ్రమైన అన్యాయమని తెలిపారు.

బహుజన సమాజ పార్టీ డిమాండ్లు:

ప్రభుత్వ ఉత్తర్వును తక్షణమే రద్దు చేయాలి

ఆ భూమిని దళితులు, బడుగు వర్గాలు, పేదల నివాసాలు మరియు ప్రజా అవసరాల కోసం వినియోగించాలి

గతంలో జరిగిన భూకేటాయింపులపై స్వతంత్ర న్యాయ విచారణ జరపాలి

ప్రభుత్వ భూముల విషయంలో పూర్తిస్థాయి పారదర్శక విధానం అమలు చేయాలి

ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించకపోతే బహుజన సమాజ పార్టీ ప్రజా ఉద్యమాలు, న్యాయ పోరాటాలు చేపడుతుందని స్పష్టంగా హెచ్చరించారు.

ఈ సమావేశంలో బహుజన సమాజ పార్టీ ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జ్ పెదపెంకి శివప్రసాద్ రావుతో పాటు, విశాఖపట్నం కోఇన్‌చార్జ్ కరణం తిరుపతి రావు, పి. కనక మహాలక్ష్మి, బి. విశ్వనాధ్, బొని కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ విజయ వేంకటేశ్వర స్వామి ఆలయ చోరీ కేసు ఛేదన



- రూ.40 లక్షల విలువైన కేసు ప్రాపర్టీ పూర్తిస్థాయి రికవరీ
- వారం రోజుల్లోనే ఐదుగురు నిందితుల అరెస్ట్

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్, శ్రీకాకుళం జనవరి 20:**కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ విజయ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం (చిన్న తిరుపతి)లో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ చోరీకి సంబంధించిన సుమారు రూ.40 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, హుండీలోని నగదును పూర్తిస్థాయిలో రికవరీ చేసి, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో వెల్లడించారు.

ఈ కేసు దర్యాప్తులో భాగంగా కాశీబుగ్గ, నరసన్నపేట పోలీస్ స్టేషన్లతో పాటు మన్యం జిల్లా బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొత్తం నాలుగు చోరీ కేసులను పోలీసులు ఛేదించి, ఆయా కేసులకు సంబంధించిన ప్రాపర్టీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేసు వివరాలు

కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో నమోదైన చోరీ కేసులో 6 తులాల బంగారు ఆభరణాలు, సుమారు 15 కిలోల వెండి ఆభరణాలు, హుండీలోని నగదు రూ.80 వేల వరకు దొంగిలించినట్లు ఫిర్యాదు నమోదైంది. వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు సమాచారం అందగానే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అదే విధంగా నరసన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు కేసుల్లో రూ.2,000 నగదు, మూడు గ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

నిందితుల వివరాలు

కురమాన శ్రీనివాసరావు అలియాస్ నాని గొట్టిపల్లి గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం

సవర బొగేష్ కారిగూడ గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం

సవర సుదర్శన్ రావు ఖశ్రీఅఖుం సిద్ధు మెట్టుగూడ గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం

పుల్లేటిగుర్తి చక్రధర్ హిరమండలం

దార రమేష్ కుమార్ గొట్టిపల్లి గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం

నేర విధానం

ముద్దాయి శ్రీనివాసరావు నేతృత్వంలో మిగిలిన నిందితులు జనవరి 3న ఆలయాన్ని రెక్కీ చేసి, జనవరి 9 రాత్రి అక్రమంగా ఆలయంలోకి ప్రవేశించి తాళాలు పగలగొట్టి బంగారం, వెండి ఆభరణాలు, నగదును దొంగిలించారు. అనంతరం సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్‌ను తొలగించి చెరువులో పడవేశారు. ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో కిటికీ మెష్‌ను తొలగించి లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు తెలిపారు. డీవీఆర్ బాక్స్‌ను కూడా పోలీసులు తిరిగి రికవరీ చేశారు.

గత నేర చరిత్ర

ముఖ్య నిందితుడు శ్రీనివాసరావుపై గతంలో 38 చోరీ కేసులు, బొగేష్‌పై 10 కేసులు, సుదర్శన్ రావుపై 7 కేసులు నమోదై ఉండగా, వీరంతా అన్ని కేసుల్లో జైలు శిక్ష అనుభవించినట్లు ఎస్పీ వెల్లడించారు.

పోలీసుల ప్రతిభకు అభినందన

ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన కాశీబుగ్గ సబ్ డివిజన్ పోలీస్ అధికారి షేక్ సహాబాజ్ అహ్మద్, కాశీబుగ్గ ఇన్‌స్పెక్టర్ ఎన్ని రామకృష్ణ, ఎస్ఐ ఆర్. నరసింహమూర్తి, పోలీస్ సిబ్బంది గవరయ్య, ఉషాకిరణ్, నీలకంఠం, షణ్ముఖరావు, సత్యంలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

భద్రతపై సూచనలు

ఆలయాల వద్ద తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విలువైన వస్తువులను సురక్షితంగా భద్రపరచాలని జిల్లా ఎస్పీ సూచించారు. డీవీఆర్ బాక్స్‌ను బలమైన గదిలో ఏర్పాటు చేసి మొబైల్ ఫోన్‌లకు అనుసంధానం చేసే విధంగా భద్రతా చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కేవీ రమణ, కాశీబుగ్గ డీఎస్పీ షేక్ సహాబాజ్ అహ్మద్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



### CHANGE OF NAME

I, JC675434Y SUBEDAR, DIVVALA MOHANA RAO, Father of DIVVALA SAI MEGHANA, resident of Maruthingar-07, Near Nilamma thalli Temple, Kambakaya Road, Narasanna peta, Srikakulam District, Andhra Pradesh, do hereby declare that my daughter's name has been changed/corrected from "SAI MEGHANA" to "DIVVALA SAI MEGHANA" for all official records. Henceforth, she shall be known as DIVVALA SAI MEGHANA for all purposes.vide affidavitdate 20 Jan 2026 before Notary B. Dhanalakshmi,Advocate, Narasanna peta, srikakulam.

### CHANGE OF NAME

I, JC 675434 Y SUBEDAR, DIVVALA MOHANA RAO, Husband of DIVVALA RADHA, resident of Maruthingar-07, Near Nilamma thalli Temple, Kambakaya Road, Narasanna peta, Srikakulam District, Andhra Pradesh, do hereby declare that my wife's name has been changed/corrected from "RADHA" to "DIVVALA RADHA" for all official records.Henceforth, she shall be known as DIVVALA RADHA for all purposes.vide affidavitdate 20 Jan 2026 before Notary B. Dhanalakshmi,Advocate, Narasanna peta, srikakulam.

## విబి-జీ రాంజీ పథకం పై వినూత్న రీతిలో ప్రచారం...!



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 20 :** విబి-జి రామ్ జి పథకం పనులపై వేతన దారులు హాజరుకావాలని క్షేత్రస్థాయి ఉద్యోగులు వినూత్న రీతిలో ప్రచారం చేపడుతున్నారు. మంగళవారం ఇందులో భాగంగా మండలంలోని నడింపాలెం, పనసలపాడు తదితర గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ మైక్ ద్వారా ప్రచారం చేశారు. సంక్రాంతి పండగ అనంతరం వేతన దారులు విబిజి రాంజీ పథకం కింద 100 రోజులు పని పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ పనులకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు విశాఖ ఉత్సవ్





✸ 9 రోజుల వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి
✸ రాష్ట్ర మంత్రులతో కలెక్టరేట్‌లో ఉమ్మడి సమీక్ష

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, జనవరి 20 :**జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక విశాఖ ఉత్సవ్ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. సోమవారం విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశాఖ ఉత్సవ్ ఏర్పాట్లు, భద్రత, రవాణా, పారిశుధ్యం, పర్యాటక అభివృద్ధి తదితర అంశాలపై ఉమ్మడి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, టూరిజం డైరెక్టర్ ఆమ్రపాలి కూడా హాజరయ్యారు.

విశాఖ ఉత్సవ్‌లో భాగంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, కళా ప్రదర్శనలు, ఆహారోత్సవాలు, పర్యాటక ప్రదర్శనల ద్వారా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రులు సూచించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని, విశాఖ నగర ప్రతిష్ఠకు తగ్గట్టుగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.

మూడు జిల్లాల సమన్వయంతో ఏర్పాట్లు

ఈ ఉత్సవానికి విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, మూడు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా చర్యలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

ప్రజాప్రతినిధుల పాల్గొనడం

సమావేశంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు.

అలాగే మూడు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యనారాయణ, కొణతాల రామకృష్ణతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

విశాఖ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలి

విశాఖ ఉత్సవ్‌ను రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా నిర్వహించాలని, పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. భద్రత, పరిశుభ్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.




## గాంధీజీ పేరు తొలగింపుపై కాంగ్రెస్ మండిపాటు

✸ రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలో భాగమే గిడుగు రుద్రరాజు




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 20:**దేశంలో రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలో భాగంగానే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీజీ పేరును తొలగించారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు గిడుగు రుద్రరాజు తీవ్రంగా విమర్శించారు. గాంధీజీ ఆలోచనలు, పేదల హక్కులు ప్రధాని నరేంద్ర మోదీకి నచ్చ వని, అందుకే గాంధీజీ పేరును మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంగళవా రం విశాఖపట్నంలోని డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హాసిని వర్మ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో గిడుగు రుద్రరాజు మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ఆలోచనా విధానాన్నే బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోందని, రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రమాద కర కుట్ర జరుగుతోందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ చట్టబద్ధంగా తీసుకొచ్చి అమలు చేసిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించా రు. మహాత్మాగాంధీ పేరుతో అమలులో ఉన్న పథకాన్ని తొలగించి, 'జీ రామ్ జీ'గా మార్చడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించడంతో పాటు, రాష్ట్రాలపై కేంద్రం మోపుతున్న అదనపు ఆర్థిక భారంపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తం గా కాంగ్రెస్ పార్టీ ఆందోళనలకు సిద్ధమైందని తెలిపారు.గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ఒకప్పుడు 100 రోజుల పని హామీ ఉండగా, ఇప్పుడు దాన్ని 75 రోజులకు తగ్గించారని తెలిపారు. ఖర్చులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాలని షరతు పెట్టడం ద్వారా కేంద్రం తన భారం రాష్ట్రాలపై నెట్టేస్తోందని అన్నారు.

గ్రామాల అవసరాలకు అనుగుణంగా కాకుండా, కేంద్రం సూచించిన పనులనే చేయాల్సిన పరిస్థి తి తీసుకొచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంత వరకు రాజ్యాంగాన్ని మార్చే ప్రయ త్నాలు ఎప్పటికీ విజయవంతం కావని గిడుగు రుద్రరాజు స్పష్టం చేశారు.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా పేదల పని హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోం దని ఆయన ఆరోపించారు. ఈ పథకాన్ని బలహీనపరచడం పేదల జీవనాధారంపై నేరుగా దాడి చేయడమేనని అన్నారు.

సోనియా గాంధీ నేతృత్వంలో, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గ్రామీణ ప్రజలకు పని హక్కు కల్పించిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేసి, బడా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతోనే కేంద్రం పనిచేస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవా లని, లేదంటే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నాయక త్వంలో, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షు రాలు షర్మిలమ్మ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని గిడుగు రుద్రరాజు హెచ్చరించారు.

ఈ సమావేశంలో విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హాసిని వర్మతో పాటు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు, నియోజకవర్గ ఇంచార్జీలు కేవీ సూర్యనారా యణ, ప్రియాంక దండి, సవరవిల్లీ రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు గాదం మహేష్, రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్, రజియా బేగం, అబీద, ప్రధాన కార్యదర్శులు ఆనందకుమార్, రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌతం, సీనియర్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాయత్రి, కస్తూరి వెంకటరావు, సోడ సుధాకర్, తెడ్డూ రామదాసు, జగన్ మురారి, కనకరావు, అప్పారావు, సేవాదళ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూరు తహశీల్దార్ ఎస్ ఎల్ వి ప్రసాద్ ఆకస్మిక మృతి

✸ మండల వ్యాప్తంగా విషాదఛాయలు





**కొయ్యురు, పెన్ పవర్ జనవరి 20 :**కొయ్యూరు తహసిల్దార్ గా పనిచేస్తున్న శ్రీకాకుళం లక్ష్మీ వరప్రసాద్ (ఎస్ ఎల్.వి ప్రసాద్ ) మంగళవారం గుండెపోటుతో మృతి చెందడం మండల వ్యాప్తంగా విషాదం చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం తాసిల్దార్ ఆఫీస్ కు చేరుకున్న వెంటనే గుండెలో నొప్పి వస్తుందని భరించలేకపోతున్నానని తాసిల్దార్ ప్రసాద్ తెలపడంతో సిబ్బంది హుటాహుటిన రాజేంద్రపాలెం పీహెచ్సీకి తీసుకువచ్చారు. అప్పటికే గుండెపోటుతో చలనం లేకుండా ఉన్న తాసిల్దార్ ప్రసాద్ కు సిపిఆర్ చేసిన ఫలితం దక్కలేదు. అప్పటికే మరణించి ఉండవచ్చునని వైద్యులు తెలిపారు. సాయంత్రం 4:00 వరకు ఆసుపత్రి వద్ద ఆయన కు ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో జీడివి ప్రసాద్, తోపాటు తాసిల్దార్ మరణించిన విషయం తెలుసుకున్న మండల అధికారులు, కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ, వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, సామాజిక కార్యకర్త ఆర్టిఐ జిల్లా నేత అర్జున్ రెడ్డి, ఏపీఓ వీఆర్వీలు,ఉపాధ్యాయులు, పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఆయనకు నివాళు లర్పించారు. ప్రతి ఒక్కరూ తాసిల్దార్ గా పనిచేస్తూ అందరితోనూ ఆప్యాయతగా మాట్లాడుతూ చనిపోవడం తీరని లోటని అన్నారు.తాసిల్దార్ ప్రసాద్ కు కుమారుడు కుమార్తె ఉన్నారు.తాసిల్దార్ మరణ వార్తతో మండల వ్యాప్తంగా విషాదఛాయలు నెలకొన్నాయి.

## నారా లోకేష్ జన్మదిన వేడుకలు, రక్తదాన శిబిరానికి నిర్ణయం




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 20 ,:**విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం పార్లమెంట్ కమిటీ కార్యవర్గం స మావేశం జరిగింది. విశాఖ పార్లమెంట్ నియోజ కవర్గ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్, ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణల అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జనవరి 23వ తేదీన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను విశాఖ జిల్లా టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అదే సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయా లని పార్టీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించా రు.అలాగే, జనవరి 25వ తేదీ ఉదయం 10 గంటలకు పార్లమెంట్ కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు గొల్లగాని వీరారావు (బుజ్జి), విల్లూ రి భాస్కరరావు, గొల్లగాని మంగవేణి, దాడి వెంకటరమేష్, లోడగల అప్పారావు, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీడియా కో-ఆర్డినేటర్ బైరెడ్డి పోతన రెడ్డి, కార్యాలయ కార్యదర్శి బండారు అప్పారా వు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు పొలమరిశెట్టి సీతారాం, గొర్రెపల్లి రాము, కోట నరేష్, బొట్టా వెంకట్ రమణ, అబ్దుల్ అనిఫ్, అలిత హేమ లత, ఊసరాణి, గునిశెట్టి నాగేశ్వరరావు, నక్క కనకరాజు, ఒమ్మి పోలరావు, బుచ్చరామిరెడ్డి, సీఎం రమణ, గాడి సత్యం, వానపల్లి రామ్ కుమార్, మల్ల రవికుమార్, ఉసిరికాయల ఢిల్లీశ్వరి, రమణారావు తదితర జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

## గాదిగుమ్మి వద్ద శాంతి సాధన పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జనవరి 20:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం ఆర్వీ నగర్‌లోని శాంతి సాధన పాఠశాలలో 2008 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం గాదిగుమ్మి వాటర్‌ఫాల్స్ వద్ద ఆత్మీయ కలయిక నిర్వహించారు.చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్న విద్యార్థులు సరదాగా సమయం గడిపారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. చదువు, స్నేహం, గురువుల అనుభవాలపై చర్చించుకుంటూ ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఇలాంటి కలయికలు స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సమావేశాలు కొనసాగించాలని నిర్ణయించుకున్నారు.

# నడింపాలెం లో పశు వైద్య శిబిరం

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపు

**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 20 :** మండలంలోని నడింపాలెం గ్రామ పంచాయతీలో మంగళవారం డాక్టర్ కే రాజేష్ కుమార్, డాక్టర్ ప్రసన్న కుమార్ వారి ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. మంగళవారం ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ... రానున్న 11 రోజులలో మండలంలోని అన్ని పంచాయతీలలో పశువులు, జీవాలకు నట్టలు నివారణ మందులను ఉచితంగా అందిస్తామని తెలిపారు. నడింపాలెంలో జరిగిన పశు వైద్య శిబిరంలో 68 పశు వులకు చికిత్స, 120 పెద్ద పశువులకు 39 దూడలకు, 219 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు మరియు 110 కోళ్లకు టీకాలు వేసామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నడింపాలెం గ్రామ సర్పంచ్ పి రాంబాబు , పెస కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పశు సంవర్ధక సిబ్బంది పాల్గొన్నారు.




## డ్రగ్స్ కు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం




**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 20) :** గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదంటూ సంకల్పం పేరిట పోలీసులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతీ యువకులతో అవగాహన సదస్సులు, ర్యాలీలు, బహిరంగ సభలు ప్రతిరోజు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల హోం మంత్రి అనిత ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలో మొదలుపెట్టిన సైకిల్ ర్యాలీ ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దోహదపడింది. అదేవిధంగా గంజాయి రవాణాకు కూడా పోలీసులు ఎక్కడికక్కడ సమాచారం రాబట్టుకుంటూ దాడులు చేస్తూ, తనిఖీలు చేస్తూ అడ్డుకట్ట వేస్తూనే ఉన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదు అంటూ ప్రచారం చేస్తూ ఫ్లెక్సీలను నర్సీపట్నంలో ప్రధాన కూడళ్ళలో సిఐ గఫూర్ ఏర్పాటు చేశారు. ఒకపక్క మత్తు పదార్థాల రవాణాలను అడ్డుకుంటూనే, మరోవైపు యువతీ యువకులలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా చైతన్యం కలిగిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్న సమాచారం పోలీసులకు అందజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆయన మంగళవారం సాయంత్రం పరిశీలించారు.

## రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన పల్లా



**గాజువాక :పెన్ పవర్ ,జనవరి 20** పారిశ్రామిక ప్రాంతం పాత గాజువాక లంక మైదానంలో ఏర్పాటు చేసిన రాజశ్యామల అమ్మవారిని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. శ్యామలనందనాథ స్వామీజీ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్యామల నందనాథ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాజువాక ప్రాంతంలో తొమ్మిది రోజులు పాటు రాజశ్యామల అమ్మవారి మహోత్సవాలు నిర్వహించడం శుభకరమని అన్నారు. శ్యామలానందనాథ చారిటబుల్ ట్రస్ట్ కు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన నల్లూరి

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జనవరి 20** జి వి యం సి 86వ వార్డు దువ్వాడలో గల ఎంపీపీ స్కూల్లో స్థానిక వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో విద్యలో ప్రాధాన్యత కనబరుస్తున్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా నల్లూరి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమంతో పాటు విద్యకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు దానిలో భాగంగానే ఈనెల 23వ తారీఖున పుట్టినరోజు జరుపుకుంటున్న రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేరు మీద వార్డులో విద్యలో ప్రాధాన్యత కనబరుస్తున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు మరియు పెన్నులు ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలలో విద్యాశాఖకు ఎప్పుడూ లేని ప్రాధాన్యత ఈ కూటమి ప్రభుత్వంలో నారా లోకేష్ ద్వారా వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాసరావు, స్థానిక వార్డు నాయకులు నాగార్జున, గోవింద్ ప్రధాన్, సిహెచ్ నాయుడు, అప్పలస్వామి, తనుబుద్ధి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# చింతపల్లి వైద్య ఆరోగ్యశాఖలో రూ.6.72 కోట్ల నిధుల కుంభకోణం

## 8 మంది సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు

**చింతపల్లి/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జనవరి 19:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి ఉపఖజానా కార్యాలయం పరిధిలో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన భారీ నిధుల దుర్వినియోగ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. 2011 నుంచి 2015 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖకు చెందిన రూ.6 కోట్ల 72 లక్షల 27 వేల 422 రూపాయల ప్రభుత్వ నిధులు అక్రమంగా వినియోగించబడ్డాయని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. కృష్ణమూర్తి నాయక్ వెల్లడించారు.డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (విజయవాడ) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, అప్పట్లో చింతపల్లి ఉపఖజానా పరిధిలో విధులు నిర్వహించిన 8 మంది వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చింతపల్లి ఎస్పీ సమక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, నిధుల దుర్వినియోగం వల్ల ప్రభుత్వానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఈ కుంభకోణంలో భాగంగా అప్పటి చింతపల్లి వైద్యాధికారిణి డాక్టర్ టి. అరుణ దేవి, సప్పర్లదారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారి డి. మహేశ్వరరావు, పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి. ప్రవీణ్, చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం సీనియర్ అసిస్టెంట్ బి. ధర్మేంద్ర, కోరుకొండ పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ షేక్ హుస్సేన్, హుకుంపేట పీహెచ్‌సీ ఎంపిహెచ్‌డబ్ల్యుజె వి. కొండలరావు, హుకుంపేట పీహెచ్‌సీ ఎంపిహెచ్‌డబ్ల్యు బొడ్డేటి జగ్గారావు, కోరుకొండ ఎంపిహెచ్‌డబ్ల్యూఎఫ్ జి. సంజీవి ఉన్నట్లు అధికారులు తెలిపారు.




ఈ నిధుల దుర్వినియోగ వ్యవహారంలో మొత్తం 65 మంది నిందితులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపారు. వీరిలో కొంతమంది ఇప్పటికే మృతిచెందగా, మరికొంతమంది ఉద్యోగ విరమణ పొందినట్లు పేర్కొన్నారు. మిగిలిన నిందితులపై ఇప్పటికే కేసులు నమోదు చేసి న్యాయస్థానాల్లో విచారణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఏడుగురు నిందితులపై విజయవాడలో కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ తెలిపారు.ప్రభుత్వ నిధుల భద్రతపై తీవ్ర ప్రశ్నలు రేకెత్తిస్తున్న ఈ కుంభకోణంపై పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పలువురు సిబ్బంది హాజరయ్యారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం





**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,జనవరి 20 :** జీవీయంసి 87వ వార్డు పరిధి సిద్ధార్థ నగర్ కి ఆనుకొని ఉన్న నాలుగు ఎకరాల 50 సెంట్లు స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కొరకు జరుగుతున్న పనులను రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం పరిశీలించారు . ఈ సందర్భంగా ముఖ్యంగా మాట్లాడుతూ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కొరకు చుట్టూ ప్రహరీ నిర్మాణం పనులు జరుగుతున్నాయని పనుల పట్ల నాణ్యత తగ్గకుండా చూడాలని మరో రెండు నెలల్లో ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రజలకు అంకితం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శృంగవరపుకోట మండలంలో అక్రమ చెట్ల నరికివేత

అధికారుల నిర్లక్ష్యమే కారణమా?



**శృంగవరపుకోట, పెన్ పవర్, జనవరి 20 :** స్థానిక శృంగవరపుకోట మండలంలోని ధర్మవరం, చామలాపల్లి గ్రామాల్లో రెండు రోజులుగా ప్రధాన రహదారి పక్కన ఉన్న చెట్లను యధేచ్ఛగా నరికివేసి రవాణా చేస్తున్న ఘటనలు వెలుగుచూశాయి. ఈ అక్రమ చర్యలపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చామలాపల్లి నుంచి ఆలుగుబిల్లి వెళ్లే రహదారి పక్కన బండల్లో ఏళ్ల తరబడి పెరిగిన మూడు కాగు చెట్లు, ఒక విలువైన టేకు చెట్టును చామలాపల్లి గ్రామానికి చెందిన తొత్తడి చిన అప్పారావు నరికించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అలాగే ధర్మవరం గ్రామ పరిధిలో రహదారి పక్కన ఉన్న బలమైన తుమ్మ చెట్లను సప్ప రవి, కిల్లో అప్పలనాయుడు నరికి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. ఘటనా స్థలంలో వేములపల్లి గ్రామానికి చెందిన లగుడు వెంకట్రావు పేరుపై ఉన్న ఏపీ 39 యూవీ 6185 నెంబరు గల ట్రాక్టర్‌లో కలపను లోడుచేస్తుండటం కనిపించడం పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేస్తోంది.

ముఖ్యంగా ట్రాక్టర్‌కు సరైన నెంబరు ప్లేట్ లేకుండా చిరిగిపోయిన స్టిక్కర్ మాత్రమే ఉండటం రవాణా, రెవెన్యూ శాఖల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తిచూపుతోంది. వాల్టా చట్టం ప్రకారం ప్రైవేటు భూముల్లో ఉన్న చెట్లను కూడా తొలగించాలంటే రెవెన్యూ శాఖ అనుమతి తప్పనిసరి. అలాంటిది ప్రభుత్వ లేదా పంచాయితీ స్థలాల్లో చెట్లను నరికి అక్రమంగా రవాణా చేయడం తీవ్రమైన నేరమని పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ స్పష్టం చేశారు. ఇది కేవలం పర్యావరణ నాశనమే కాకుండా భవిష్యత్ తరాలకు ముప్పుగా మారుతుందని ఆయన హెచ్చరించారు. ప్రధాన రహదారుల వెంట చెట్లు తొలగితే రహదారి భద్రత, వాతావరణ సమతుల్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంటున్నారు. అయినప్పటికీ రెవెన్యూ, రహదార్లుభవనాల శాఖ అధికారులు ఇప్పటికీ స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖలు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ కలప రవాణాపై కఠిన నియంత్రణలు అమలు చేయాలని స్థానికులు, పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థుల కోసం పర్యావరణ దినోత్సవాలు కాలమానిని





* ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలి.

**అనకాపల్లి పెన్ పవర్ జనవరి 20:**విద్యార్థుల కోసం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ రూపొందించిన పర్యావరణ దినోత్సవాల కాలమానిని (క్యాలెండర్) 2026 ఆవిష్కరించడం ఆనందదాయకం అని అనకాపల్లి జిల్లా ఉద్యానవనాల శాఖ అధికారి ఎం. రాజశేఖరం అన్నారు. మంగళవారం ఉదయం అనకాపల్లి ఉద్యానవన శాఖ కార్యాలయంలో ఆయన క్యాలెండరు విడుదల చేసిన తర్వాత నగరం లోని మిద్దె తోటల రైతులకు వంజంగి వంకాయ, దేశీయ టమాటా, బంతి, బాపట్ల మిర్చి తదితర మొక్కలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఈ కాలమానిని వినియోగించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి అని కోరారు. ప్రతి ఒక్కరూ ఇంటి దగ్గర ప్రకృతి ఆధారంగా పంటలు పండించాలి అని కోరారు. మిద్దె తోటల పెంపకం దారులకు తాము అవసరం అయిన శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు జాతి మొక్కలు అధికంగా పెంచాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మేంగో మేన్ అప్పాజీ, సిఫా సిఇఒ డాక్టర్ శశిప్రభ, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ సంస్థ అనకాపల్లి హెచ్ ఆర్ డి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, అనకాపల్లి మిద్దె తోటల పెంపకం దారులు పాల్గొని మాట్లాడారు.

## కొండకించంగి గ్రామంలో నూతన దేవుని మందిర ప్రతిష్ట



రోడ్డు సమస్యపై అధికారులకు విజ్ఞప్తి

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 20:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం, జర్రెల పంచాయితీ పరిధిలోని కొండ కించంగి గ్రామంలో నూతన దేవుని మందిర ప్రతిష్ట (చర్చి) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి స్థానిక పాస్టర్ ఆహ్వానం మేరకు జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి,జీకే వీధి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యేసు క్రీస్తు బోధనలు సమాజానికి అత్యంత అవసరమని, ప్రతి వ్యక్తి జీవితంలో ఆధ్యాత్మిక జీవితం గడపాలని సూచించారు. యేసు క్రీస్తు చూపించిన ప్రేమ, కరుణ, దయ, క్షమ, సహన గుణాలను ప్రతి ఒక్కరు అనుసరించాలని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో జీకే వీధి మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు,వైసీపీ మండల కార్యదర్శి మువ్వల చిన్నబ్బాయి, జర్రెల పంచాయితీ వైసీపీ అధ్యక్షులు కరణం గోపాల్ కృష్ణ, పంచాయితీ ప్రధాన కార్యదర్శి జోభ స్వామి నాధం, సీనియర్ నాయకులు వంతల రాజారావు, గెమ్మెల సూరిబాబు, స్థానిక పాస్టర్ కొర్ర హనోక్,చింతపల్లి డివిజన్ క్రిస్టియన్ ఫెలోషిప్ అధ్యక్షులు పాతూను దేవిడ్ రాజు మరియు అనేక దైవ జనులు, పాత్రులు, జాన్ విక్టర్, జాన్ బాబు, సైమన్, స్టిఫెన్ తదితరులు పాల్గొన్నారు.కాగా, కార్యక్రమంలో భాగంగా కొండ కించంగిసత్యవరం మధ్య రోడ్డు సమస్యపై ప్రజల విజ్ఞప్తి కూడా వినిపించింది. ఎన్నో ఏళ్లుగా సత్యవరం నుండి కొండ కించంగి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం పెండింగ్‌లోనే ఉన్న విషయం ప్రజలు పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కొండ కించంగి, చెక్కరాయివీధి, లోబ్బో గుంట, గైగోమ్ పల్లి, చింతల పాడు గ్రామాల ప్రజలకు రోడ్డు సమస్య తీరుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ ఈ సమస్యను గుర్తించి, వెంటనే పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి.

**ఆదివాసీ ప్రత్యక డీఎస్సీ నోటిపికేషన్ విడుదల చేయాలి.**

**ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్**

**అరకులోయ పెన్ పవర్ 20:**ఆదివాసీ నిరుద్యోగుల సంఘం, ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో పాడేరు ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ సత్యనారాయణ ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మపుడాల్ మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతంలో 100% ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తామని గౌరవ ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో హామీ ఇవ్వడం జరిగిందని హామీ అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వలన ఆదివాసి నిరుద్యోగులు గత మెగా డీఎస్సీలో సుమారు 5 వేల మందికి ఆదివాసీ అభ్యర్థులు తీవ్ర నష్టం జరిగిందని దీని ఫలితంగా ఆదివాసి ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయి తీవ్ర నిరాశకు గురియ్యారని ఆదివాసి ప్రాంతంలో ఐటీడీఏ ల పరిధిలో ప్రాజెక్ట్ అధికారి పర్యవేక్షణలో ఆదివాసీ ప్రత్యక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి ఆదివాసి ప్రాంతంలోఆదివాసి అభ్యర్థులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడం చాలా బాధాకరం ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ నిలబెట్టుకుని ఏజెన్సీ ప్రాంతంలో 100% ఉద్యోగ నియామక చట్టం చేసి ఆదివాసి ప్రాంతంలో ప్రత్యక డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు 5 వ షెడ్యూల్ ఆదివాసీ ప్రాంతంలో సర్వ హక్కులు,అధికారాలు ఆదివాసులకు ఉన్నాయని ఉద్యోగ నియామకాల మాత్రం గిరిజనేతరులకు ఇవ్వడం ఆదివాసుల హక్కులు చట్టాలు కాలరాయడమే అవుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదివాసులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని 100 శాతం రిజర్వేషన్లు కల్పించి డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ ప్రత్యక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయా నియమాలు చేపట్టాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు

ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా నాయకులు డిపి శంకర్, రాము, ప్రశాంత్, ఎస్ ఫ్ ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్,ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు బోండా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం





**గాజువాక :పెన్ పవర్ ,జనవరి 20 :**శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం గాజువాక ఆర్యవైశ్య సంఘం,వాసవీ క్లబ్ ల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.స్థానిక ఆలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు.ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు సుప్రభాత సేవ వివిధ అభిషేకాలు నిర్వహించారు.అమ్మవారికి లక్ష చామంతి పుష్పార్చన చేశారు.రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు,నగర డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రాజు ముఖ్య అతిధులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించి ప్రసాదాలు అందజేశారు.సంఘం అధ్యక్షుడు తాళ్ళూరి మల్లేశ్వరరావు,కులుకూరి మంగరాజు,కేసారపు శ్రీను రమేష్,సంఘ సభ్యులు,వాసవీ క్లబ్,వనిత క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## ప్రమాదకర డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

* జాతీయ రహదారిపై పోలీసుల కట్టుదిట్టమైన తనిఖీలు
* ఎఎస్పీ నవజ్యోతి మిశ్రా



**చింతపల్లి,పెన్ పవర్,జనవరి 20:-**చింతపల్లి ప్రాంతంలో జాతీయ రహదారిపై అధిక వేగంతో, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని చింతపల్లి ఎఎస్పీ నవజ్యోతి మిశ్రా హెచ్చరించారు. మంగళవారం ఉదయం తనకార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కొందరు యువకులు మోటార్‌సైకిళ్లపై హల్చల్ చేస్తూ ప్రమాదకరంగా ప్రయాణించడం వల్ల ఇతర వాహనదారులు ,పాదచారులు తీవ్రఆందో ళనకుగురవుతున్నారని తెలిపారు. ఇలాంటి వారిని గుర్తించి పట్టుకుని చట్టపరంగా శిక్షలు విధిస్తామని స్పష్టం చేశారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని సరైన డాక్యుమెంట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.చింతపల్లి సీఐ వినోద్‌బాబు, ఎస్సైలు వీరబాబు, ఎం. వెంకటరమణ ఆధ్వర్యంలో వారపు సంతలు, జాతీయ రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించినవాహనదారులకు చలానాలు తప్పవని ఎఎస్పీ స్పష్టం చేశారు.ప్రజల భద్రతే లక్ష్యంగాఈచర్యలుతీసుకుంటున్నామని,వాహనదారులుసహకరించాలని ఆయన కోరారు.

